దవాఖానలకు వైద్య పరికరాల అందజేత

ఏటూరునాగారం/ వెంకటాపురం (నూగూరు) మార్చి 14 : ఏటూరునాగారం మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాల, వెంకటాపురం (నూగూరు)లోని సామాజిక వైద్యశాలకు హుండాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ ఫండ్స్‌ను సమారిటర్న్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.27లక్షల విలువ చేసే వైద్య పరికరాలు, హాస్పిటల్ కేర్ సామగ్రిని శుక్రవారం అందజేశారు. వెంకటాపురంలోని వైద్యశాలకు రూ.18లక్షలు, ఏటూరునాగారంలోని వైద్యశాలకు రూ. 9లక్షల విలువ చేసే పేషెంట్ వెయిటింగ్ చైర్స్, స్టూల్స్, టేబుల్స్, బీరువాలు, ర్యాక్‌లు, వీల్ చైర్స్, సెల్ కౌంటర్స్, నెబులైజర్స్, ఈసీజీ, సీపీజీలు, మానిటర్లు, స్ట్రెచర్లు, పారా మీటర్లు తదితర సామగ్రిని వైద్యశాలలకు అందించినట్లు సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలలకు అవసరమైన అనేక రకాల పరికరాలు ఫర్నీచర్‌ను అందజేశారన్నారు. అనంతరం వైద్యశాలల్లోని విభాగాలను సంస్థ ప్రతినిధులు సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధినేత రామ్‌కుమార్, హుండాయ్ సీఎస్ఆర్ టీం సభ్యుడు శ్రీకాంత్, వైద్యులు పాల్గొన్నారు.

వెంకటాపురం (నూగూరు) : వైద్య పరికరాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, వైద్యశాల సూపరింటెండెంట్

గ్రామాలభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, మార్చి 14 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రూ.95 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సుబ్బక్కపల్లిలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, టేకుమట్ల, పంగిడిపల్లి, పెద్దంపల్లి, వెలిశాల, గరిమిళ్లపల్లి గ్రామాల్లో ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతతో కూడిన పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాఘవాపూర్‌లో లక్ష్మీనరసింహాస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి రాఘవాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం నుంచి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గణపురం : మోదుగ పూలతో ప్రత్యేక అలంకరణలో గణపేశ్వరుడు

భూపాలపల్లి రూరల్ : వేడుల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

వాజేడు : రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

ఏటూరునాగారం : వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

కృష్ణకాలనీ : భూపాలపల్లిలో రంగులు పూసుకుంటున్న మహిళలు

రంగ్ బర్‌సే..

- ఘనంగా హోలీ వేడుకలు
- రంగులు చల్లుకొని ఆడి పాడిన యువత

నమస్తే నెట్‌వర్క్, మార్చి 14 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో శుక్రవారం హోలీ వేడులు ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు రంగులు చల్లుకొని సంబురాలు జరుపుకున్నారు. భూపాలపల్లి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌శర్మ కుటుంబ సభ్యులు, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు. సహజ సిద్ధమైన రంగులతో హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు క్యాంపు కార్యాలయంలో సిబ్బందితో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఏటూరునాగారంలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఐటీడీఏ ఉద్యోగులు, అటవీశాఖ అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే రెండు జిల్లాల్లోని ఆయా పోలీస్ స్టేషన్లలో ఎస్సైలు వేడుకల్లో పాల్గొన్నారు. గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మోదుగ, తీగదారి పూలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మోదుగు పూలతో అలంకరించడం 13 ఏండ్లుగా ఆనవాయితీగా వస్తున్నది.

భూపాలపల్లి రూరల్ : హోలీ వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు, ఎస్పీ కిరణ్‌ఖరే

వెంకటాపూర్ : పోలీస్ స్టేషన్‌లో హోలీ వేడుకలు చేసుకుంటున్న యువకులు

ములుగు రూరల్ : ములుగులో హోలీ వేడుకల్లో చిన్నారులు

మాదిగలను మోసం చేసేందుకు ప్రభుత్వం కుట్ర

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షకు మద్దతు

టేకుమట్ల, మార్చి 14 : వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మాదిగలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ చేస్తున్న మాదిగ దండోరా నిరసన దీక్షలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటం ప్రారంభించి సుమారు 35 ఏండ్లు అయిందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎట్టకేలకు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. వర్గీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకే విస్తృతమైన అధికారాలు ఇస్తూ తీర్పునిచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఇప్పటికీ పురోగతి సాధించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతున్నదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాలను పిలిచి అభిప్రాయం చెప్పాలి కానీ, రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయం చెప్పిన తరువాత పిలువడం దుర్మార్గపు ఆలోచనకు సంకేతమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ పై స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణిగుంట్ల శంకర్, రాంచందర్, మచ్చ శ్రీకాంత్, తూర్పాటి రాజు, రాములు, ఆది రఘు, ఆకునూరు తిరుపతి, ఉద్దమారి మహేశ్, గువ్వాడ లక్ష్మణ్, పైడి పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షకు శుక్రవారం మండల ఏకలౌవ్య సంఘం నాయకులు సుల్తాన్ సుధాకర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనంతరం ప్రభుత్వ నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు బెల్లంపల్లి మల్లేశ్, సదానందం, మంథెన రవితేజ, లింగాల కోటయ్య, లింగాల సమ్మయ్య, చింతకుంట్ల సాయి పాల్గొన్నారు.

టేకుమట్ల : ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలో కూర్చొని మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మాదిగలకు అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి

ములుగురూరల్ : మాదిగలకు సీఎం రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అన్నారు. ములుగు కలెక్టరేట్ కార్యాలయం పక్కనే ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన దీక్ష శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఆయన మాట్లాడారు. జడ్పీటీసీ స్థాయి నుంచి సీఎం పదవి వరకు మాదిగల అండతో ఎదిగిన రేవంత్‌రెడ్డి తమకు చేసింది ఏమి లేని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కొడారి సాంబయ్య, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కోతి కార్తీక్, మరాఠి రవీందర్, బాబు, రాజు, కుమార్, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

ములుగు రూరల్ : దీక్షలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు

బైక్ చెట్టును ఢీకొని యువకుడి మృతి

తాడ్వాయి, మార్చి 14 : బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో దన్నూరి సాయికుమార్ (22) మృతి చెందగా మరో యువకుడు పాయం నితిన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నర్సాపురం(పీఏ) గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మంగపేట మండలం బాలన్నగూడేనికి చెందిన సాయికుమార్, అదే మండలంలోని దోమడకు చెందిన నితిన్ భద్రాద్రి కొత్తగుడెం జిల్లా కరగకగూడెం మండలం చొప్పాల గ్రామంలో జరిగే ముసలమ్మ జాతరకు బైక్‌పై వెళ్లారు. దర్శనం అనంతరం ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. నర్సాపురం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సాయికుమార్ అక్కడిక్కడే మృతి చెందగా అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి తీవ్రంగా గాయపడిన నితిన్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

మహదేవపూర్, మార్చి 14 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సూరారం జీపీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన చల్ల రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఇంటి నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అనుమతి పత్రాలు జీపీ రికార్డులో నమోదు చేయకుండా నిధులు స్వాహా చేస్తున్నాడని ఆరోపించారు. గ్రామస్తులు ఏ అనుమతి కోసం వెళ్లినా దాటవేసే ధోరణి అవభిస్తుండంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దేవునిగుట్ట ఆలయానికి రూ.లక్ష విరాళం

ములుగురూరల్, మార్చి14 : ములుగు మండలం దేవునిగుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గ్రామ పెద్ద వీరమనేని రవీందర్‌రావు, ఆయన కుమారుడు వీరమనేని నితిన్‌రావు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ వారు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

విరాళం అందజేస్తున్న రవీందర్‌రావు, నితిన్‌రావు

అలరించిన ఫేర్వెల్ డే వేడుకలు

కాటారం, మార్చి 14 : మండలకేంద్రంలోని ఆదర్శ విద్యాసంస్థలో గురువారం రాత్రి నిర్వహించిన ఫేర్వెల్ డే వేడుకలు అలరించాయి. విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పదో తరగతి విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రుల గొప్పతనాన్ని తెలియజేసే విధంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలతో వారు భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, వేద పండితులు నాగరాజు శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాదాలకు పూజ చేస్తున్న విద్యార్థులు

తండ్రిని కాపాడబోయి కుమారుడు మృతి

పండుగ పూట జనగామలో విషాదం

జనగామ చౌరస్తా, మార్చి 14 : హోలీ పండుగ పూట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తండ్రిని కాపాడబోయి ఓ పుత్రుడు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారకర ఘటన జనగామలో జరిగింది. కరెంట్ షాక్ తగిలిన తండ్రిని కాపాడబోయి కుమారుడు కనిష్క వర్ధన్ వర్మ (12) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బచ్చన్నపేటకు చెందిన సందెల వెంకటేశ్వర్లు-స్వప్న దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వర్లు జనగామ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ స్థానిక కుర్మవాడ ఏరియాలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. సిద్దిపేట రోడ్డులోని బ్రాహ్మణవాడ (శామీర్‌పేట)లో కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం హోలీ పండుగ సందర్భంగా సెలవు కావడంతో కొత్త ఇంటికి నీళ్లు పట్టడానికి తన ఇద్దరు కుమారులను తీసుకొని వెళ్లాడు. మోటర్ ఆన్ చేసి నీళ్లు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు వెంకటేశ్వర్లు కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన పెద్ద కుమారుడు కనిష్క వర్ధన్ వర్మ కర్ర సాయంతో తండ్రిని కాపాడబోయే ప్రయత్నంలో తాను కూడా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ప్రమాదం స్థలంలో పక్కనే ఉన్న చిన్న కుమారుడు గట్టిగా అరవడంతో స్థానికులు వచ్చి కర్రతో విద్యుత్ వైర్లను పక్కకు తొలగించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న తండ్రీ, కొడుకులను చికిత్సనిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. వెంకటేశ్వర్లు ప్రాణాలతో బయటపడగా, పెద్ద కుమారుడు కనిష్క వర్ధన్ వర్మ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామం బచ్చన్నపేటకు తరలించారు. కనిష్క వర్ధన్ వర్మ ప్రస్తుతం జనగామలోని నెహ్రూపార్కు సెయింట్ పాల్స్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. అతడు చదువులో మంచి ప్రతిభగల విద్యార్థి అని పాఠశాల ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ తెలిపారు. తండ్రిని కాపాడబోయి ప్రాణాలు విడిచిన బాలుడి ధైర్య సాహసాలను ప్రభుత్వం గుర్తించి, అతడికి శౌర్య పురస్కారాన్ని ఇవ్వాలని స్థానికులు విన్నవించారు.

కనిష్క వర్ధన్ వర్మ(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి

సంగెం, మార్చి 14: బొలేరో వాహనం బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తాపీమేస్త్రీ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బంగారు బాబు(34) మండలకేంద్రంలో ఉంటూ తాపీమేస్త్రీ పనులు చేస్తున్నాడు. శుక్రవారం బంగారు బాబు తోటి మేస్త్రీ పులగర శివమణితో కలిసి పనుల కోసం బైక్‌పై తిమ్మాపురం గ్రామానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరంగల్ నుంచి సంగెం మీదుగా నెక్కొండ వైపు అరటి గెలలు తీసుకొచ్చేందుకు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా ఎదురుగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బంగారు బాబుకు తీవ్ర గాయాలు కాగా, మణికంఠ కాలు, చేయి విరిగింది. వారిని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో బంగారు బాబు మృతి చెందాడు. మణికంఠ చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

యారన్ పంపిణీలో జాప్యం

- ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న చేనేత సంఘాలు
- టెస్కో ద్వారా పంపిణీ చేయాలని కోరుతున్న ప్రతినిధులు

పోచమ్మమైదాన్, మార్చి 14: చేనేత సంఘాలకు అవసరమైన యారన్ (నూలు)ను నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) అధికారులు సకాలంలో పంపిణీ చేయడం లేదు. ఒకవైపు సంబంధిత అధికారులు ఎన్‌హెచ్‌డీసీ నుంచే యారన్ కొనుగోలు చేయాలని చెబుతుంటే.. మరోవైపు ఎన్‌హెచ్‌డీసీ అధికారులు పట్టించుకోవడం లేదని చేనేత సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. యా రన్ కావాలంటూ ఆర్డర్ ఇచ్చి అడ్వాన్స్ చెల్లిస్తున్నప్పటికీ యారన్ పంపిణీలో జాప్యం చేస్తున్నట్లు చెబుతున్నారు. నగదుపై కొనుగోలు చేస్తున్న యారన్‌ను సకాలంలో పంపిణీ చేయకపోవడంతో నేత సంఘాల్లో ఉత్పత్తులు నిలిచిపోతున్నారు. నేషనల్ హ్యాండ్లూమ్ తీరు వల్ల దాదా పు రెండు మూడు నెలల కాలం పడుతుండడంతో నేత కార్మికులకు చేతినిండా పని దొరకడం లేదు. దీంతో ఖరీదు చేసిన నూలు కోసం సంఘాలు నిత్యం ఎదురుచూడాల్సి వస్తున్నది. చేనేత జౌళిశాఖ అధికారులు మాత్రం ఎన్‌హెచ్‌డీసీ నుంచి కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం, టెస్కో ద్వారా ఖరీదు కూడా దీనికి ముడి పెట్టడంతో సంఘాలు దివాలా తీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పలు సంఘాల ప్రతినిధులు గత్యంతరం లేక యారన్ ఖరీదు కోసం ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. అక్కడ కొనుగోలు చేస్తున్న యారన్ నాణ్యత లేకున్నా, అరువుకు తీసుకోవడం వల్ల రేట్లు పెరుగుతున్నప్పటికీ ఖరీదు చేయకతప్పడం లేదంటూ వాపోతున్నారు. అలాగే, టెస్కో అధికారులు ఈ యారన్ ద్వారా తయారు చేసి న ఉత్పత్తులను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోయినా ప్రైవేట్ యారన్‌ను కొనుగోలు చేయకతప్పడం లేదని పేర్కొంటున్నారు.

టెస్కో ద్వారా నూలు పంపిణీ చేయించాలని విజ్ఞప్తి

గతంలో ఆప్కో ద్వారా యారన్ పంపిణీ చేసేవారు. ఆప్కో ద్వారా కొనుగోళ్లు చేసిన ఉత్పత్తుల్లో 60 శాతం వరకు నూలు, 40 శాతం వరకు కార్మికుల వేతనాల కోసం నగదు చెల్లించేవారు. అలాగే, సంఘాల అభివృద్ధికి 20 శాతం సబ్సిడీ ఇచ్చేవారు. దీనివల్ల సంఘాల్లో ఉత్పత్తులు యథావిధిగా కొనసాగడం, కార్మికుల ఉపాధి పనులకు ఇబ్బంది ఉండేది కాదు. నేడు టెస్కో ద్వారా ఉత్పత్తులను సకాలంలో ఖరీదు చేయకపోవడంతో సంఘాలు చతికిల పడే పరిస్థితి ఉంది. వెంటనే యారన్‌ను సకాలంలో పంపిణీ చేయాలని పలు చేనేత సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కమర్షియల్ స్పేస్‌లు అమ్మకం
★ హనుమకొండలో కిరాయిలు వచ్చు 1650, 2500, 6000 Sft. కమర్షియల్ స్పేస్‌లు తక్కువకు అమ్మకానికి కలవు. వెంటనే సంప్ర: సెల్: 9348199922.
NTW-332339

WANTED TEACHERS
★ WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

PLOT FOR SALE
★ జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.
NT-330714

PLOT FOR SALE
★ హైదరాబాద్‌లో నూతన నగరం ఫ్యూచర్ సిటీ శ్రీశైలం హైవే మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్స్ కలవు. 100 చ.గజాలు 6 లక్షలు మాత్రమే... మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 100% రిటర్న్స్... EMI కలదు. Cont: 8008091512.
NT-330716

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565